ప్రజాశక్తి

బుధవారం 5 నవంబర్ 2025 5

శ్రీ సత్యసాయి



వైబి.హాళ్లి సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని వైబి. హళ్లి గ్రామ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు స్పందించారు. 'అభివృద్ధికి ఆమడదూరంలో వైబిహళ్లి' అనే శీర్షిక సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో వెలువడిన కథనంపై స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.రాజు స్పందించారు. ఈ మేరకు ఆయన తన క్యాంప్ కార్యాలయంలో వైబిహళ్లి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో సమస్యలపై చర్చించారు. అక్కడి నుంచే రాష్ట్ర ఆర్అండ్బి శాఖ మంత్రితో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడారు. వైబి.హళ్లి గ్రామానికి రోడ్డు వేయించాలని మంత్రిని కోరారు. గ్రామంలో నెలకొన్న రోడ్డు సమస్యలను ఆయనకు వివరించారు. గ్రామంలో రోడ్డు ఏర్పాటుకు అవసరం అయ్యే ప్రతిపాదనలు పంపాలని మంత్రి ఎమ్మెల్యేకు తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు.

అక్రమార్కుల కల్పవృక్షం 'పురం' మున్సిపల్ మార్కెట్

అనుమతులు లేకుండా అండర్ గ్రౌండ్ స్థలం అప్పగింత
పురపాలక సంఘం ఆదాయానికి గండి



అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పూలవ్యాపారం



అద్దె చెల్లించి ఎండలో వ్యాపారం చేస్తున్న కూరగాయల వ్యాపారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం ఆధర్యంలో నిర్మించిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ అక్రమార్కులకు కల్పవృక్షంగా మారింది. ఇక్కడ ఒక్కోక్కరికి ఒక్కో విధంగా గదులు, స్థలాలను కేటాయించారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి గండి పడింది. స్థలాల కేటాయింపులో మున్సిపల్ రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయం కాస్తా పాలకులు, అధికారుల జేబుల్లోకి వెళుతోంది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం పురపాలక సంఘానికి సెలక్షన్ గ్రేడ్ ఉంది. ఇక్కడ పురపాలక సంఘ ఆధీనంలో ఉన్న కూరగాయల మార్కెట్ శిథలం అయిందని గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా సమయంలో పడగొట్టారు. అదే స్థలంలో కూరగాయల మార్కెట్ తో పాటు వాణిజ్య సముదాయ భవనం నిర్మాణం చేశారు. వాణిజ్య సముదాయ భవనాలను బహిరంగ వేలం వేశారు. అయితే వేలంలో దక్కించుకున్న వారు ఇంత వరకు పూర్తి స్థాయిలో వ్యాపారాలను ప్రారంభించలేదు. ఇక పోతే కూరగాయాల మార్కెట్ బహిరంగ వేలంలో పాలకులు, అధికారులు కలిసి ఆ సమయంలో భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఏకంగా ఒక కౌన్సిలర్ కు రూ. 1.35 లక్షలు, ఇక వైస్ చైర్మన్లకు రూ. 3 లక్షలు, ఛైర్పర్సన్ కు రూ. 5లక్షలు, మున్సిపల్ అధికారులకు ఏకంగా రూ. 10 లక్షలు కూరగాయాల వ్యాపారులు ఇచ్చినట్లు ఆరోపణలు వినపిస్తున్నాయి. దీంతో తూతూ మంత్రంగా బహిరంగ వేలం నిర్వహించి గదులను అప్పగించారన్న విమర్శలున్నాయి. అయితే వ్యాపారులు గదుల్లో వ్యాపారం చేయకుండా గదుల బయట వ్యాపారాలు చేస్తుండడంతో మార్కెట్ మొత్తం ఇరుకుగా మారింది. అదే సమయంలో మార్కెట్ ఆవరణంలో ఉన్న ఖాళీ స్థలంలో ఆకు కూరల వ్యాపారులకు 16 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. దీని కోసం ఆ సమయంలో పురపాలక సంఘానికి డిపాజిట్ చెల్లించాలన్న పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ. 30 వేల నుంచి 50వేల రూపాయల వరకు మార్కెట్ అసోసియేషన్ వారు వసూలు చేశారని తెలుస్తోంది. ఇందులో పురపాలక సంఘానికి రూ.5వేలు చెల్లించి, మిగిలిన డబ్బులను పాలకులు, అధికారులు వాటలు వేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో పాటు నెలకు వ్యాపారులు రూ.500 వరకు అద్దెలు సైతం చెల్లిస్తున్నారు. ఇది చాలదన్నట్లు చివరకు వాణిజ్య సముదాయ భవనాలను అద్దెలకు తీసుకున్న వారు వారి సొంత ఆస్థుల తరహాలో గదులను వారికి ఇష్టం వచ్చినట్లు షెట్టర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయం తెలిసినప్పటికి మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. వాణిజ్య సముదాయ భవనాలు, కూరగాయల మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలాన్ని పూల వ్యాపారులకు ధారదత్తం చేశారు. దీనికి మున్సిపల్ శాఖ అనుసరించాల్సిన కనీస నిబంధనలు సైతం అధికారులు పాటించ లేదన్న ఆరోపణలు వినపిస్తున్నాయి. తొలి నుంచి కూరగాయల వ్యాపారుల నుంచి ఆకు కూరల వ్యాపారులు, పూల వ్యాపారుల వరకు కేటాయించిన స్థలాలపై ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే పెద్ద అవినీతి బయటపడడమే కాకుండా మున్సిపాల్టీకి ఆదాయం సైతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని పుర ప్రజలు కోరుతున్నారు.

గుట్టు చప్పుడు కాకుండా కేటాయింపులు

వానిజ్య సముదాయ భవనం, కూరగాయల మార్కెట్ అండర్ గ్రౌండ్ లో ఉన్న ఖాళీ స్థలాన్ని 99 మంది చిరు వ్యాపారులకు కేటాయించేలా 2022 వ సంవత్సరం నవంబర్ 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఆ తీర్మానం అనుసరించి చిరు వ్యాపారులకు కేటాయించాలి. దీని కోసం 64 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.5వేలు, నెలకు అద్దె రూ.750, 150 చదరపు అడుగుల స్థలానికి డిపాజిట్ రూ.7,500, నెలకు అద్దె రూ. 1250లుగా నిర్ణయించారు. అయితే ఈ స్థలాన్ని చిరు వ్యాపారులకు కాకుండా 25 మంది హోల్ సేల్ పూల వ్యాపారులకు గత సంవత్సరం జనవరి 10న గుట్టుచప్పుడు కాకుండా లాటరీ విధానం ద్వారా కేటాయించడానికి ఎంపిక చేశారు. దీనికి ప్రతిఫలంగా పూల వ్యాపారులు పాలక వర్గానికి లక్షల రూపాయల్లో మాముళ్లు ఇచ్చే విధంగా రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే పంపకాల్లో బేరం కుదరక పోవడంతో ఈ అంశం ఇప్పటి వరకు జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు రాలేదని తెలుస్తోంది. దాదాపు 20 నెలల నుంచి ఎటువంటి డిపాజిట్, అద్దెలు చెల్లించకుండానే పూల వ్యాపారులు మున్సిపల్ మార్కెట్ అండర్ గ్రౌండ్ స్థలంలో వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కనీస చర్యలు సైతం తీసుకోవడం లేదు. నిర్ణయించిన అద్దెలు వసూలు చేస్తున్నారా...?, వసూలు చేస్తుంటే ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయన్నది అర్థం కావడం లేదు.

పైసా చెల్లించరు...సేవలు చేయాల్సిందే

పురపాలక సంఘ వ్యాప్తంగా వాణిజ్య సముదాయాల నుంచి చెత్తను సేకరిస్తే ప్రతి నెల వారి నుంచి యూజర్ చార్జీలను వసూలు చేస్తారు. అయితే ఇప్పటి వరకు పూల వ్యాపారులు పురపాలక సంఘానికి పైసా కూడా అద్దె చెల్లించ లేదు. అయినప్పటికి మార్కెట్లో వారు వేస్తున్న చెత్తను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేసి, చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీని కోసం పురపాలక సంఘానికి ప్రతి నెల అదనపు ఖర్చు అవుతోంది.

> **పరిశీలించి చర్యలు తీసుకుంటాం**
>
> మున్సిపల్ కమిషనర్గా భాధ్యతలను స్వీకరించినప్పటి నుంచి వాణిజ్య సముదాయ భవనం, కూరగాయాల మార్కెట్ పై ప్రత్యేక దృష్టి సారించాను. పూల మార్కెట్ విషయం సైతం పరిశీలన చేసి, పూల వ్యాపారులకు స్థలాలను ఎప్పుడు కేటాయించారు. ఇతర విషయాలను సమగ్రంగా పరిశీలన చేసి, నిబంధనల మేరకు చర్యలు తీసుకొంటాం.
>
> **మల్లికార్జున,**
> **మున్సిపల్ కమిషనర్**



ఆందోళనలో పాల్గొన్న నాయకులు

సమస్య పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

శ్మశానవాటిక దారి సమస్యపై 4వ రోజు ఆందోళన

ప్రజాశక్తి - చిలమత్తూరు

కొర్లకుంట గ్రామ ఎస్సీ కాలనీకి సంబంధించిన శ్మశానవాటిక దారి సమస్య పరిష్కరించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సిపిఎం, సిపిఐ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు తెలియజేశారు. శ్మశానవాటిక దారి సమస్యపై మండల పరిధిలోని కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం నాడు వంటావార్పుతో నిరసన తెలిపారు. కాలనీవాసులకు సిపిఎం, సిపిఐ, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు కార్యకర్తలు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అధికారులు తక్షణం స్పందించి కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసుల శ్మశాన వాటికకు దారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం చేయకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. కొర్లకుంట ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితి సమాజానికి సిగ్గు చేటు అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మాట్లాడుతూ కొర్లకుంట స్మశాన దారి సమస్య పరిష్కారం అయ్యే వరకు ఈ పోరాటం ఆగదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ రామచంద్ర, దళిత హక్కుల పోరాట సమితి నేతలు సాకే రామకష్ణయ్య, కె.అంజన్న బాబు, ఎల్వి.రమణ, జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఊటుకూరు నాగరాజు, దళిత సమైక్య జిల్లా అధ్యక్షుడు నారాయణ, ఎఐటియుసి తాలూకా ఉపాధ్యక్షుడు ముబారక్ పాషా, కొండూరు యువకులు అనిల్ కుమార్, నరేంద్ర, డేవిడ్, కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసులు గోపాలకృష్ణ, నాగేంద్ర, లక్ష్మీపతి, నరసింహమూర్తి, వేణు, గోపాల్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సర్వే

కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసులకు సంబంధించిన శ్మశానవాటిక స్థలం సమస్యపై అధికారులు స్పందించారు. డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్, డిఐ సర్వేయర్ శామ్యూల్, మండల సర్వేయర్ కోదండపాణిలు మంగళవారం కొర్లకుంట గ్రామానికి వెళ్లి శ్మశానానికి అసరమైన దారి ఏర్పాటుకు సర్వే నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ ఎస్సీ కాలనీ నుంచి శ్మశానానికి దారి ఏర్పడాలంటే ఏడుగురు రైతులకు సంబంధించిన పట్టా భూముల్లో నుంచి వెళ్లాల్సి ఉందన్నారు. ఈ మేరకు సదరు రైతులకు నోటీసులు అందించామని, వారి అభిప్రాయాలను బుధవారం తెలియజేయాలని సూచించామన్నారు. ఆ తర్వాత ఉన్నాధికారుల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

హంద్రీనీవా కాలువను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

ప్రజాశక్తి-మడకశిర టౌన్, గుడిబండ

మడకశిర మండలం మణురు హంద్రీనీవా కెనాల్ పంప్ హౌస్, గుడిబండ మండలం హీరేతుర్పి వద్ద జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులు కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు మంగళవారం పరిశీలించారు. కాలువలో ఉన్న కంపచెట్లను పూడికను త్వరగా తొలగించి అమరాపురం చెరువును త్వరలో సాగునీరుతో నింపేలా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కరువు ప్రాంతమైన మడకశిరను సస్యశ్యామలం చేసే విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఇ స్వరూప్, ఆర్డీవో ఆనంద్ కుమార్, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, గుడిబండ టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కసాపురం చిత్తయ్య, చంద్రప్ప నాగభూషణ, కార్యదర్శి శ్రీనాథ్, నాగరాజు, శ్రీరామ రెడ్డి, డైరెక్టర్ ప్రకాష్, సాగునీటి సంఘం అధ్యక్షులు నిరంజన్ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు భవనం పరిశీలన

మడకశిర కేంద్రంగా రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు సంబంధించిన భవనాన్ని కలెక్టర్ శ్యామ్ప్రసాద్, ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు, ఆర్డీవో ఆనంద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు మమగళవారం పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో భవన సముదాయాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. త్వరలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు అవసరమయ్యే భవనం ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలియజేశారు.

కామ్రేడ్ హైదర్ వలి మృతి కార్మిక ఉద్యమానికి తీరనిలోటు

నివాళి అర్పించిన కార్మిక, ప్రజాసంఘాల నాయకులు
ధర్మవరంలో అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించిన సిఐటియు నాయకుడు కామ్రేడ్ హైదర్ వలి మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని వాపమక్ష, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు తెలియజేశారు. ధర్మవరం పట్టణానికి చెందిన పట్టణానికి చెందిన సిఐటియు జిల్లా నాయకుడు హైదర్ వలి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాస విడిచారు. హైదర్ వలి పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు పట్టణంలోని ఆయన స్వగృహానికి మంగళవారం తీసుకువచ్చారు. జిల్లా సీపీఎం, సిఐటియు నాయకులు కామ్రేడ్ హైదర్ వలి ఇంటికి చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు జంగాలపల్లి పెద్దన్న, టి.అయూబ్ ఖాన్, ఎస్ఎచ్.బాషా తదితరులు మాట్లాడుతూ హైదర్ వలి గత 15సంవత్సరాల నుంచి పేదల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం ఆందోళనలు నిర్వహించారని తెలియజేశారు. అలాంటి నాయకుడు మరణించడంతో కార్మిక ఉద్యమానికి తీరని లోటు అన్నారు. వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అమీర్ బాషా, సత్యసాయి జిల్లా సిపిఎం నాయకులు ఖాదర్ బాషా, మారుతీ, సిఐటియు నాయకులు ఎల్.ఆదినారాయణ, రమణ, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ అధిశేషు తదితరులు నివాళులు అర్పించారు. కార్మికులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హైదర్వలీ అంత్యక్రియలను నిర్వహించారు.




హైదరవలి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

సీఏ ఫలితాల్లో 'పురం' వాసి ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

ఇటీవల విడుదలైన గ్రూప్ -1 చార్టెడ్ అకౌంటెంట్ ఫలితాలలో హిందూపురం రూరల్ మండలం నక్కలపల్లికి చెందిన యువకుడు కోనన్నగారి రంజిత్ రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దేశ వ్యాప్తంగా విడుదల చేసిన ఫలితాలలో తొలిసారిగా పరీక్ష రాసి మొదటి ప్రయత్నంలోనే 164 మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన కోనన్నగారి రామిరెడ్డి కుమారుడు రంజిత్ రెడ్డి మే నెల 2024 లో గ్రూప్-2 లో పరీక్షల్లో కూడా ఒకే ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించాడు. ఎన్నో ఏళ్ళుగా, ఎన్నో ప్రయత్నాలు చేసినా సీఏలో అర్హత సాధించలేని తరుణంలో రంజిత్ రెడ్డి ఒకే ప్రయత్నంలో రెండు గ్రూపుల్లో ఉత్తీర్ణత సాధించడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ రంజిత్ రెడ్డికి అభినందనలు తెలిపారు.



సీఏలో ప్రతిభ కనబర్చిన రంజిత్ రెడ్డి

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం ప్రత్యేక శిబిరంలో భాగంగా పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ వద్ద ఉన్న కొట్నూరు చెరువు కట్టను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అనిల్ కుమార్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆటంకాలు లేకుండా అభివృద్ధి పనులు

బాబా ఉత్సవాల నాటికి పనులు పూర్తి చేస్తాం
ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో పుట్టపర్తి ప్రాంతంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలియజేశారు. మంగళవారం నాడు చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. జాయ్ అలుక్కాస్ జ్యువెల్లరీ కంపెనీ సహకారంతో రూ.1.20 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు చిన్నపిల్లల పార్కు సుందరీ కరణ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కర్ణాటక నాగేపల్లి వంతెన సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సొంత మార్కెట్ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నది పరివాహక ప్రాంతంలో ఎలాంటి చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు, వేయకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ను ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డివైడర్ల మధ్యలో అందమైన పూల మొక్కలు నాటాలన్నారు. ఆర్టీసీ బస్టాండు ముందు ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కు ఏర్పాటుకు పరిశీలించాలన్నారు. పట్టణంలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, మున్సిపల్ డిఈ నరసింహ మూర్తి, సిఐ శివాంజనేయులు, టిడిపి కూటమి నాయకులు రామాంజనేయులు, సామకోటి ఆదినారాయణ, గంగాధర్ నాయుడు, సురేష్, లాయర్ హరికృష్ణ, జ్యోతి ప్రసాద్ పాల్గొన్నారు.



ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి

రవాణా సౌకర్యం కల్పించండి

సత్యసాయి జయంతి ఉత్సవాల నేపథ్యంలో పర్యాటకులు, బాబా భక్తులకు అవసరమయ్యే బస్సులను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిఋఱ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకాతిరుమల రావును కోరారు. మంగళవారం పుట్టపర్తికి వచ్చిన ఎమ్డిని ప్రశాంతి నిలయం శాంతిభవన్లో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్జె రత్నాకర్తో కలసి కలిశారు. పుట్టపర్తిలో శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయని తెలిపారు. అందుకు తగ్గట్టుగా బస్సులు నడిపి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని నగరాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు అదనపు బస్సులు నడపాలని కోరారు. అంతకు మునుపు జిల్లా ఆర్ఎం మధుసూదన్, డిపో మేనేజర్ ఇనయ తుల్లా, ట్రస్టు ప్రతినిధులు ఎండికి స్వాగతం పలికారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల కోసం సిఐటియు ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు తెలియజేశారు. మంగళవారం స్థానిక ప్రశాంతి గ్రామ్ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జెడ్పి శ్రీనివాసులు, కోశాధికారి లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడారు. సిఐటియు జిల్లా 10వ మహాసభ హిందూపురంలో రెండు రోజులపాటు జరిగిందన్నారు. అందులో రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. నూతన కార్యవర్గం కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తుందని తెలియజేశారు. జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో కియాతో పాటు హిందూపురం, కదిరి నియోజకవర్గాలలో భారీ, మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలలో వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. స్కీం వర్కర్లు అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపాలిటీ, హమాలీలు ఉన్నారన్నారు. వీరందరి సమస్యలనూ పరిష్కరిస్తూ సిఐటియు వారి పక్షాన నిలుస్తుందని తెలియజేశారు. కార్మికులందరికీ కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, సాంబశివ, సిద్దు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సృజనాత్మకతను అలవర్చుకోవాలి



ధర్మవరంలో ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు



రొళ్ల మండలంలో ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు, నాయకులు

మండలస్థాయి చెకుముకి సంబరాల్లో నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రతి విద్యార్థి సృజనాత్మకతను అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు పేర్కొన్నారు. జెవివి ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిశేషు, ఎంఇఒలు గోపాల్ నాయక్, రాజేశ్వరిదేవి మాట్లాడుతూ చెకుముకి సైన్సు సంబరాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. సామాజిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే సైన్సు ను ప్రచారం చేయడంలో జెవివి కృషి అభినందనీయమన్నారు. దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అనారోగ్యం, కరువు కాటకాలు పోయి దేశ ప్రజల్లో గుణాత్మక మార్పు రావాలంటే ఒక్క సైన్సు అభివృద్ధితోనే సాధ్యమని అన్నారు. సైన్స్ ను కేవలం మార్కులు తెచ్చి పెట్టే పాఠ్యాంశంగా చూడకుండా నిజ జీవితంలో అన్వయించుకున్నప్పుడే ప్రతీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, జెవివి నాయకులు ఖలందర్, లోకేష్, ఉపాధ్యాయులు తిమ్మారెడ్డి. శేఖర్, హరి, రామకృష్ణ, గోవర్ధన్, మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని ఆలోచించుకోవడంతో పాటు సైన్స్ పట్ల అసక్తిని పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని అల్వీ లాల్ పాఠశాల లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శాస్త్రీయ విజ్ఞానంలో విద్యార్థులు ముందంజలో ఉండాలని, శాస్త్రీయ తృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. మండల స్థాయి ప్రతిభ కనపర్చిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అక్బర్ షరీఫ్, జెవివి నాయకులు ఓబులేషు, మురళీమోహన్, ఉగ్రప్ప, నారాయణస్వామి, అబ్దుల్ హక్, సుధా, బాల గంగాధర్ నాయక్, చంద్ర, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని జెవివి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సురేష్ బాబు, హెడ్మాస్టర్ శిరీష, జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు కట్టుబడి గౌస్ లాజమ్, పవన్ కుమార్, గౌరీ శంకర్ రెడ్డి, బాబావలి, జనార్ధన, జనార్ధన్ రెడ్డి, రమేష్ నాయక్, కృష్ణవేణి ,రాధ, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : సామాజిక సమస్యల పరిష్కారంలో శాస్త్రీయ విజ్ఞానం కీలకమని,అందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని కదిరి మండల విద్యాశాఖ అధికారి చెన్నకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక కదిరి శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి పరీక్షలు నిర్వహించి జిల్లా స్థాయికి బృందాలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కె.వీరాస్వామి, కె.నాగబసిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల పరిధిలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మండలంలోని ఎనిమిది పాఠశాలలకు చెందిన 24 మంది విద్యార్థులు పరీక్ష పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనపర్చిన వారిని బహుమతులు అందజేశారు. వీరు జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ - 2 కుళ్లాయప్ప, ప్రధానోపాధ్యాయులు రవి శంకర్ విద్యార్థులు పాల్గొన్నారు

రొళ్ల : రొళ్ల, మడకశిర మండలంలో గల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మడకశిర సరస్వతీ విద్యా మందిర పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. జెవివి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు రమేశ్, ప్రధాన కార్యదర్శి డి. మారుతీ ప్రసాద్, కార్యదర్శి ఉమేష్, 17 ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష పోటీలను నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనపర్చిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ మెయిన్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో క్రీస్తు జ్యోతి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికైనట్లు మండల అధ్యక్షులు నబీ పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు లక్ష్మీబాయి, హనుమంతు నాయక్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో మంగళవారం మండల స్థాయి చెకుముకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రొద్దం ఎంఇఒ 1, 2 అరవింద్, జయభాస్కర్, రొద్దం జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనారాయణమ్మ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి. సి. నరేష్, మండల ప్రధానకార్యదర్శి మారుతి, వ్యాయామ ఉపాధ్యాయుడు, జి రమేష్, కొగిర హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు మహేష్ హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని జెవివి నాయకులు చెప్పారు.

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి చెకుముకి పోటీలను నిర్వహించినట్లు హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన వారు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలీ, రాజారత్నం, ఓబుల్ రెడ్డి, వెంకటశివారెడ్డి, కరుణాకర్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతి విద్యా మందిరంలో మండల స్థాయి చెకుముకి సైన్ సంబరాలను మంగళవారం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి విజి.శ్రీనివాస్, మండల అధ్యక్షులు రవేష్, ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, కార్యదర్శి ఉమేష్‌ల ఆధ్వర్యంలో పట్టణం, మండలంలోని 17 ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ఇందులో పాల్గొని పరీక్షలను నిర్వహించారు. గౌడనహళ్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సెంటెన్స్ ఉన్నత పాఠశాల, రొళ్ల బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేశారు.

నేరాలు ఘోరాలు

కల్లు స్వాధీనం....నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి-హిందూపురం

ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. హిందూపురం మండలం చౌళూరు గ్రామ పరిసరాల్లో అనిల్ అనే వ్యక్తి నుండి ఏడు లీటర్ల అనుమతి లేని కల్లును స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి గ్రామ సమీపంలో నరసింహమూర్తి అనే వ్యక్తి నుండి ఐదు లీటర్ల అనుమతి లేని కల్లు, కోనాపురం గ్రామ సమీపంలో గోవిందప్ప అను వ్యక్తి ఆరు లీటర్లు అనుమతి లేని కల్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేయడం జరిగిందన్నారు. కాగా పాపిరెడ్డిపల్లిలో ఇమాం సాబ్ అనే వ్యక్తి 10 మద్యం షాట్ విస్కీ బాటిల్స్ కలిగి ఉండగా మొత్తం వాటిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం నలుగురు వ్యక్తులపై నాలుగు కేసులు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు. ఇకపోతే పులమతి కల్లు డిపో, గోళ్లాపురం కల్లు దుకాణంలో కల్లు నమూనాలను సేకరించామని, పరీక్ష నిమిత్తం చిత్తూరు ప్రయోగశాలకు పంపించామని వివరించారు.కల్తీ కల్లు అరికట్టేలా కల్లు అమ్మకదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి, కల్తీ కల్లు విక్రయ దారుల మీద పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. కల్లుతాగే వారికీ అవగాహన కల్పించి, కల్లు తాగడం వలన కలిగే అనారోగ్య, జీర్ణవ్యవస్థ మీద వాటి ప్రభావం, కల్లు మీద ప్రజలకు అవగాహన కల్పించినట్టు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.టీ.ఎఫ్ పుట్టపర్తి సీఐ హరికృష్ణ, ఎస్ఐలు, ఓం సింహ, ఫరూక్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సమీపంలోని దేవరపల్లి వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి తీవ్ర గాయాలకు గురైనట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శశికుమార్ తెలిపారు. ఆయన నుండి ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. తీవ్ర గాయాలకు గురైన వ్యక్తి ఆనవాళ్లు గుర్తించగలిగిన వ్యక్తులు హిందూపురం రైల్వే పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని శశికుమార్ కోరారు.

పేకాటజూదరుల అరెస్టు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలో పేకాట ఆడుతున్న 8మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ వీరాంజనేయుకు అందిన సమాచారం మేరకు ట్రైనీ ఎస్ఐ గోపాల్‌కృష్ణ సిబ్బందితో మండలంలోని నల్లూరు గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.5000 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

ప్రజాశక్తి-లేపాక్షి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేపాక్షి మండలవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల కోసం మంచి భోజనం ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు చంద్ర శేఖర్ రెడ్డి, పవన్ హరీష్ గణేష్, మునాఫ్, దిలీప్, సాయికుమార్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద సొసైటీ అధ్యక్షులు వీరంజినేయులు అధ్యక్షతన రైతులతో మంగళవారం నాడు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సహకార బ్యాంక్ సీఈవో సురేఖా రాణి, నాబార్డ్ డిడిఎం అనురాధ, హిందూపురం డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఆదినారాయణ, పెనుకొండ సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ రమణా రెడ్డి, ప్రభాకర్ నాయక్, బ్రాంచ్ మేనేజర్ నాగభూషణం ఇందులో పాల్గొన్నారు. సొసైటీ ద్వారా రైతులకు అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారం రోజుల్లోపే పంట రుణాలను అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, సూపర్‌వైజర్ రంగలక్ష్మమ్మ, పర్సన్ ఓబులేష్, నారాయణ స్వామి, సీఈవో వెంకటేశులు, ఇస్లాపురం సీఈవో హరికృష్ణ, సోమందేపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు వెంకటేశులు, కలిపి ఎఫ్ఎస్‌సిఎస్ అధ్యక్షులు రామచంద్ర, మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రామకృష్టప్ప, చంద్రమౌళి, అశ్వర్థ నారాయణ, ఎస్.రామక్రిష్ణ, గుత్తా శ్రీనాథ్ చౌదరి, పవన్, సిద్ధన్న, క్రిష్టప్ప, చిరంజీవి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి సౌకర్యం

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పరిధిలో అర్హత కలిగిన వారందరికీ ఇంటి నిర్మాణాలు చేయించి ఇవ్వడం జరుగుతుందని హిందూపురం పార్లమెంట్ మీడియా కన్వీనర్ చంద్రమోహన్ యాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు మోతుకుపల్లిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మోతుకపల్లిలో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇంటి పట్టాలకు సంబంధించి ఇల్లు ఉండి ఇంటికి ఏ ఆధారం లేని వాళ్లకు పొజిషన్ సర్టిఫికేట్ సర్టిఫికెట్ అందజేసేందుకు లబ్ధిదారుల గుర్తింపు చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా ఇల్లు ఉండి దానికి సంబంధించి ఎలాంటి ఆధారం లేని వారికి అర్హత క్రమంలో పొజిషన్ సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, రాజు, సచివాలయ,సిబ్బంది, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు లేపాక్షి విద్యార్థులు

ప్రజాశక్తి - లేపాక్షి

స్థానిక కస్తూరిబా పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేకాధికారిణి నీలిమ తెలిపారు. అనంతపురం ఆర్డీటి స్టేడియంలో మంగళవారం నాడు జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ -17 విభాగంలో విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న హిమబిందు, వైష్ణవి పాల్గొని ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో బాపట్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి లో కూడా గెలుపొందాలని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లి తండ్రులు మండల ప్రజలు ఆకాంక్షించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా



ప్రతిభా క్రీడాకారులతో ఉపాధ్యాయులు, తదితరులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు గోపాల్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ తెలిపారు. కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జిఎఫ్ డివిజనల్ లెవెల్ క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించారు. కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి, నల్లమాడ, ఓడిసి, గోరంట్ల, మండలాల నుంచి 500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అండర్ 17 కోకో బాలుర విభాగంలో. కొత్తచెరువు జట్టు విన్నర్‌గా, ఓడిసి మండలం రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీలో బుక్కపట్నం మండలం విన్నర్‌గా, ఓడిసి మండలం రన్నర్స్‌గా నిలిచాయి. అండర్ 17 బాలికల విభాగంలో. బుక్కపట్నం మండలం విన్నర్స్‌గా, నల్లమడ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. కోకోలో కొత్తచెరువు జట్టు విన్నర్‌గా నల్లమాడ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. అండర్ 14 బాలికల జూనియర్ విభాగంలో పుట్టపర్తి జట్టు విన్నర్స్‌గా గోరంట్ల జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో కొత్తచెరువు జట్టు విన్నర్స్‌గా, నల్లమడ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. కోకో విభాగంలో గోరంట్ల మండలం విన్నర్స్‌గా, కొత్తచెరువు మండలం రన్నర్స్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో గోరంట్ల మండలం జట్టు విన్నర్స్‌గా, ఓడిసి మండలం రన్నర్స్‌గా నిలిచాయి. బాలుర విభాగం అండర్ 14 కోకోలో కొత్తచెరువు జట్టు విన్నర్స్‌గా గోరంట్ల జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. కబడ్డీ విభాగంలో ఓడిసి జట్టు విన్నర్స్‌గా, బుక్కపట్నం జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో గోరంట్ల జట్టు విన్నర్స్‌గా ఓడిసి జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పీఈటీలు రామకృష్ణ, సూరి, గోపి, సూర్యనారాయణమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

దీపస్తంభంపై సంస్కృత శాసనం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు మండలం పరిధిలో పాత దేవరపల్లి లో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ గుడి దీపస్తంభంపై సంస్కృత శాసనం, పక్కనే రాతి పలకపై తెలుగు శాసనం గుర్తించినట్టు చరిత్రకారుడు మైనాస్వామి మంగళవారం తెలిపారు. చారిత్రక పరిశోధకుడు బుక్కపట్నం గోపి శాసనాలను గుర్తించగా మైనా స్వామి వాటిని పరిశీలించారు. దీపస్తంభంపై కన్నడ భాషలో రాసిన సంస్కృత శాసనం "శుభమస్తు...సంభూత ధాత్రి త్రిత్వం ప్రరోహ" అని మొదలవుతోందన్నారు. కనకగిరి కి చెందిన జగపతి రాజు అని, ఊరి పేరు రాజు పేరు శాసనంలో పేర్కొన్నారన్నారు. జగపతి రాజు చెన్నకేశవాలయానికి దీప స్తంభాన్ని బహుహూకరించి ఉంటాడని మైనాస్వామి వివరించారు. ఇలా ఉండగా గుడి ప్రవేశద్వారం ఎదురుగా ఉన్న రాతి పలక శాసనాన్ని తెలుగులో శాలివాహన శకం 1514, అంటే సామాన్య శకం 1592 నాడు రాసినట్టు చరిత్రకారుడు చెప్పారు. విజయనగర సామ్రాజ్య రెండో రాజధాని పెనుకొండ నుంచి పాలన సాగిస్తున్న అరవీటి వంశానికి చెందిన ఒకటో వెంకటపతి రాయల హయాంలో చేసిన భూదాన అంశాన్ని తెలుగు శాసనం తెలుపుతోందని మైనాస్వామి వివరించారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవాలయానికి సుమారు 120 ఎకరాల మాన్యం ఉందని ప్రధాన అర్చకులు మాధవాచార్యులు తెలిపారు.



దీపస్తంభంపై ఉన్న శాసనాన్నిచూపుతున్న మైనాస్వామి, బుక్కపట్నం గోపీ



గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

విద్యతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు విద్యతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని బాల యేసు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జియావుల్లా ఖాన్, భగత్ సింగ్ సేవా సమితి అధ్యక్షులు కార్తీక్ పేర్కొన్నారు.. హిందూపురం రూరల్ మండలం దేవీనహళ్లి పంచాయితీ పరిధిలోని సంజీవరాయలపల్లి గ్రామంలో బాల యేసు డిగ్రీ కళాశాల ఎన్ఎస్-ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారం తో ముగిసింది. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పర్యావరణం, విద్య, ఆరోగ్యం, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దేవి ప్రసన్న, భగత్ సింగ్ విద్యార్థి సంఘం గౌరవ అధ్యక్షులు గిరి రంగ, ఎన్ఎస్ఎస్ పిఒలతో పాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, సామాజిక సేవ, సాంస్కృతిక విభాగాల్లో కూడా పాలు పంచుకోవాలని అనంతపురానికి చెందిన ఆలిండియా రేడియో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ హారిక, స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి సూచించారు. మంగళవారం స్థానిక ఎన్. ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతోత్సవాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రగతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హారిక మాట్లాడుతూ విద్యార్థులు ఎల్లప్పుడూ పుస్తకాలకే పరిమితం కాకుండా, సాంస్కృతిక కార్యక్రమాలకు కొంత సమయాన్ని వెచ్చించి, సృజనాత్మకతను పెంపొందించుకొని సొంతన పొందాలన్నారు. తమకు ప్రవేశం ఉన్న కళలలో పట్టు సంపాదించి, నేర్చుకున్న కళలను కళాశాలకే పరిమితం కాకుండా, భారత ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ నిర్వహించే పోటీలలో కూడా అర్హత సాధించాలన్నారు. ప్రతిభ సంపాదించుకున్న కళలను అనంతపురం ఆకాశవాణి కేంద్రంలో ప్రదర్శించవచ్చన్నారు. ఫ్రెషర్స్ పార్టీ సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి. వెంకటేశులు, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్. శ్రీలక్ష్మి, అధ్యాపకులు, సీనియర్ అసిస్టెంట్ బీ.నరసింహులు పాల్గొన్నారు.



విద్యార్థినికి జ్ఞాపికను అందిస్తున్న ప్రిన్సిపల్

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకు



శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని తూంగోడు పంచాయతీ చిన్న బావయ్య పల్లిలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్‌లోని ఓ భాగం కూలిపోయి నీరు వృథాగా వెళుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్యను అధికారులు, పాలకులు పట్టించుకోలేదని వారు విమర్శిస్తున్నారు. గ్రామంలో సుమారు రెండు వందల పైబడి కుటుంబాలు నివాసం ఉన్నాయన్నారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే నీటిని పట్టుకోవాల్సి వస్తుందని వాపోయారు. నీటి వృథాలో గ్రామంలోని రహదారులన్నీ నీటిమయమయ్యాయని చెప్పారు. దీంతో ఆయా ప్రాంతాలు దోమలకు అవాసాలుగా మారి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మంత్రి సవిత దృష్టి సారించి నూతన నీటి ట్యాంకు మంజూరు చేయాలని గ్రామస్తులు బాబు, శివ శంకర్ రెడ్డి, హెచ్ కిష్టప్ప, శ్రీరాములు, పెద్దన్న, పోతన్న, గంగ రత్న, అంజనమ్మ, నాగమ్మ తదితరులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి జగనన్న కాలనీలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు కార్టన్ సెర్చ్ నిర్వహించారు. ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో పోతుకుంట, బత్తలపల్లి ఎస్ఐలు శ్రీనివాసులు, సోమశేఖర్, ట్రైనీ ఎస్ఐ ప్రసన్నలు సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించి సోదాలు నిర్వహించారు. ప్రతి ఇంటినీ తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తుల గురించి ఆరా తీశారు. రికార్డులు సక్రమంగా లేని ద్విచక్రవాహనాలను స్టేషన్‌కు తరలించారు. కాలనీల్లో ఇళ్ల ముందు సిసి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని సిఐ తెలియజేశారు. ఘర్షణలకు వెళ్లే వారిపై పోలీసులు కఠినంగా వ్యహరిస్తారని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-అమడగూరు

మండల పరిధిలోని మహమ్మదాబాద్ మూడు రోడ్ల కూడలిలో ఎస్ఐ సుమతి ఆధ్వర్యంలో వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సిలను వారి వద్ద ఉంచుకోవాలన్నారు. వాహనాలు నడిపేప్పుడు హెల్మెంట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపరాదన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బది రామకృష్ణ గౌడ్, సురేంద్ర, జబిబుల్లా, గంగాధర్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని రాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మడకశిర మండలం ఎఆర్ రోప్పం గ్రామాల్లో 2005-06 మధ్య పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలకు ఆర్థిక సాయం అందజేశారు. పాఠశాల అభివృద్ధి నిమిత్తం రూ.25 వేల విలువజేసే పుస్తకాలను అందజేశారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన వృక్షా ఛారిటబుల్ ట్రస్ట్ 2006వ బ్యాచ్ విద్యార్థులు వరప్రసాద్, కంచేగౌడ, భాస్కర నారాయణగౌడ, రంగనాథ్, లోకేష్, లక్ష్మీకాంత్, రామాంజనేయులు, ఎ.గోపాల్, నాగేంద్రప్ప, మహదేవప్ప, ఎండి శివన్న, బి.గోపాల్, మంజునాథ్, ఎన్.లోకేష్, శివన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు గోరంట్ల విద్యార్థులు

ప్రజాశక్తి-గోరంట్ల

గోరంట్ల పట్టణ బాలల ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-14 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. కొత్తచెరువు మండలంలో డివిజనల్ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయికి గోరంట్ల బాలురఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

హేమావతి ఆలయ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - అమరాపురం

సత్య సాయి జిల్లాలో పురాతన చరిత్ర కలిగిన అమరాపురం మండలంలో గల 7 వ శతాబ్దం నాటి హేమావతి ఎంజేరు సిద్దేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. హేమావతి గ్రామంలోని టూరిజం అతిథి గృహం నందు హేమావతి పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో మంగళవారం జిల్లా, నియోజకవర్గ ,మండల స్థాయి ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాకృతిలో భక్తులకు దర్శనమిస్తున్న పురాతన దేవాలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, త్రాగునీటివసతి, రెస్ట్ రూమ్‌ల ఏర్పాటు తదితర మౌలిక వసతుల కల్పించడానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా రథోత్సవం సందర్భంగా రోడ్డు ఇరుకున ఉండడంతో భక్తుల సౌకర్యార్థం రోడ్డు వెడల్పు చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం దేవాలయం శిధిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతు పనులు చేయడానికి కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో దేవాలయం ఉండడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి దీనికి సంబంధించిన నివేదికను పంపి మరమ్మతుకు కృషి చేయడానికి ప్రయత్నం చేస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా హేమావతిని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయడానికి సోలార్ విలేజ్‌గా ఎంపిక చేస్తామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ అభివృద్ధికి కావలసిన నివేదికలను ఎంపీడీవో రామారావు, ఆర్ డబ్ల్యు ఎస్డిఈ మును నాయక్ నివేదిక అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,హేమావతి పంచాయతీ దత్తత తీసుకోవడం ద్వారా అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలోనిప్రధాన సమస్యలను మాజీ సర్పంచ్ హనుమంతరాయప్ప, మండల క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఓంకార్ స్వామి తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హేమావతి పంచాయతీ నాయకులు కలెక్టర్ మరియు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీలకు భారీ గజమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎల్ ఎస్ ఏ ఈ ఈ స్వరూప్ కుమార్, ఆర్డిఒ ఆనంద్ కుమార్, ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈ మునునాయక్,వెలుగు పీడీ నరసయ్య, తహశీల్దార్ లక్ష్మీనరసింహం, ఎంపీడీవో రామారావు, వ్యవసాయ అధికారి మంజునాథ్ , ఏవో ఆరాధ్య, విద్యుత్ డి ఈ,విద్యుత్ ఏఈ సిద్దేశ్వర, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ హరీష్, ఇరిగేషన్ ఏఈ భార్గవ్, డాక్టర్లు భార్గవ్, అంబరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.